

హుస్నాబాద్‌లో క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



క్రిస్మస్ తాత వేషధారణలో ఉన్న బాలుడికి కేక్ తినిపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తా

- నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి
- హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌లో నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలు, కానుకలు పంపిణీ

హుస్నాబాద్, డిసెంబర్ 23 : రాష్ట్రానికి మంత్రిగా ఉన్నప్పటికీ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రైస్తవులకు కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషిచేస్తానన్నారు. హుస్నాబాద్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన జరుగుతున్నదని, ఆర్డీవో కార్యాలయాన్ని విస్తరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలకు ముందు హుస్నాబాద్‌కు మంజూరైన రూ.25కోట్ల నిధుల విషయంపై కూడా ఆరా తీస్తున్నామన్నారు. హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి కాల్వల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్ పనులు, సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, హుస్నాబాద్‌లో క్రైస్తవ కమ్యూనిటీ భవన నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే రెండు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.

**ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ జరుపుకోవాలి :**

**-కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్**

క్రైస్తవులు ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ పండుగ జరుపుకోవాలని సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, ఆర్డీవో బెన్ షాలోమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీలు లకావత్ మానస, మాలోత్ లక్ష్మి, కొక్కుల కీర్తి, కొత్త వినీత, అనిత, స్వప్న, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, బొల్లి కల్పన, చిత్తారి పద్మ, వల్లపు రాజు, భూక్యా సరోజన, ఎండీ అయూబ్, నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి వచ్చిన క్రైస్తవులు, పాస్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**ఆలయాల్లో మంత్రి పూజలు**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా హుస్నాబాద్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంతోపాటు రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. సతీసమేతంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఐదేండ్లలో హుస్నాబాద్ అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు.

## ఏడుపాయల టెండరు ఆదాయం రూ.2.36 కోట్లు

పాపన్నపేట, డిసెంబర్ 23 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయానికి ఓపెన్ టెండర్ల ద్వారా రూ.2.36 కోట్ల ఆదాయం సమకూరినట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, పాలక మండలి చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆలయ ఈవో కార్యాలయం వద్ద ఏడాదిపాటు కొబ్బరి కాయలు, ఒడిబియ్యం, పూజాసామగ్రి విక్రయాలు, తలనీలాలు పోగు చేసుకునే హక్కుల కోసం వేలంపాట నిర్వహించారు. కొబ్బరి కాయలు విక్రయించుకునే హక్కు కోసం వేలంపాట నిర్వహించగా, వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది పాటదారులు పాల్గొన్నారు. మెదక్ పట్టణానికి చెందిన ధర్మకర్ లింగోజి రూ.1.11 కోట్లకు కైవసం చేసుకున్నారు. దేవస్థానం వద్ద ఒడిబియ్యం పోగు చేసుకునే హక్కును నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింహులుగౌడ్ రూ.86.50 లక్షకు కైవసం చేసుకున్నారు. పూజా సామగ్రి విక్రయానికి నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన తిరుపతి రూ.18.50 లక్షలకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, పాలకమండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, పెంటయ్య, సాయిలు, కిషన్, యాదయ్య, బాగారెడ్డి, చక్రపాణి, నాగభూషణం, టెండరుదారులు, ఆలయ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్‌శర్మ, ప్రతాప్‌రెడ్డి, యాదగిరి, నర్సింహులు, నరేశ్, మహేశ్ పాల్గొన్నారు.

## ఖోఖోలో జాతీయ స్థాయికి సోనా ఎంపిక




ఖోఖోలో జాతీయ స్థాయికి ఎంపికైన సోనా

కల్హేర్, డిసెంబర్ 23 : కొమురంభీమ్ జిల్లా ఆసిఫాబాద్‌లో ఈ నెల 20, 22వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 ఖోఖో బాలికల విభాగంలో కృష్ణాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రమావత్ సోనా జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రావు తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలో ఉమ్మడి మెదక్ జిల్లా టీమ్ నుంచి కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రమావత్ సోనా, జనుముల వర్ష ప్రాతినిధ్యం వహించారన్నారు. పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీకి రమావత్ సోనా ఎంపికయ్యారు. జార్ఖండ్ రాష్ట్రంలో త్వరలో నిర్వహించే పోటీల్లో క్రీడాకారిణి పాల్గొననున్నదన్నారు. ఎంపికైన సోనాను, ఖోఖోలో శిక్షణ ఇచ్చిన పీఈటీ రాములును పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

**సౌజ్ జోన్ జాతీయ ఖోఖో పోటీలకు చౌటకూర్ క్రీడాకారులు**

చౌటకూర్, డిసెంబర్ 23 : సౌత్ జోన్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు చౌటకూర్ గ్రామానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన బుర్కల బిందుసాగర్, సార శ్రవన్‌కుమార్, కొన్యాల కాశీభూపాల్, మంతూరు మహేశ్ హైదరాబాద్‌లోని దోమల్‌గూడ, ప్రభుత్వ వ్యాయామ కళాశాల (బీపీఈడీ)లో ప్రథమ సంవత్సరం శిక్షణ పొందుతున్నారు. శుక్రవారం ఏవీ కళాశాలలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో 15 మంది వ్యాయామ క్రీడాకారులు సౌత్ జోన్ జాతీయ స్థాయి ఖోఖో క్రీడలకు ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో ఈ నెల 26వ నుంచి 31వ తేదీ వరకు జరిగే క్రీడల్లో పాల్గొననున్నారు. వీరి ఎంపికపై పీఈటీలు పల్లె శ్రీనివాస్‌గౌడ్, బర్కత్‌పల్లి భద్రప్ప, కట్కం నాగాగౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

## రంగనాథస్వామి ఆలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ పూజలు

అందోల్, డిసెంబర్ 22 : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం అందోల్‌లోని రంగనాథస్వామి ఆలయంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అందోల్ రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం హోమ్ కమింగ్ పేరిట పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పూర్వ విద్యార్థుల వ్యవహారాల డిప్యూటీ డైరెక్టర్ నవీన్ పినపాత్రుని పాల్గొన్నారు. -పటాన్‌చెరు, డిసెంబర్ 23

## ఘనంగా ఉద్యానవర్సిటీ ఫౌండేషన్ డే వేడుకలు

ములుగు, డిసెంబర్ 23 : ములుగులోని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం 9వ ఫౌండేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యాన వర్సిటీ వైస్ చాన్సిలర్ డాక్టర్ నీరజాప్రభాకర్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ డీడీజీ హెచ్‌పీసింగ్ హాజరై యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆయిల్‌సీడ్స్ రిసెర్చ్ డైరెక్టర్ ఆర్‌కే మాథూర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు క్లైమేట్ స్మార్ట్ హార్టికల్చర్, ఆటోమేషన్, యాంత్రీకరణ, ఆయిల్‌పామ్ పెంపకదారులకు లాభాలు చేకూర్చే విధానాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యూనివర్సిటీ హ్యాండ్‌బుక్‌ను ప్రారంభించారు. రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, యూనివర్సిటీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యూనివర్సిటీ హ్యాండ్‌బుక్‌ను చూపుతున్న మాజీ డీడీజీ హెచ్‌పీసింగ్, యూనివర్సిటీ అధికారులు

## ఆరోగ్య సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి కమల్ వర్ధన్‌రావు
- రంగంపేట, సంగాయిపేట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కొల్చారంలో మాట్లాడుతున్న కేంద్రం ఆరోగ్యశాఖ కార్యదర్శి కమల్ వర్ధన్‌రావు

కొల్చారం/చేగుంట డిసెంబర్ 23 : ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి కమల్‌వర్ధన్‌రావు అన్నారు. కొల్చారం మండలంలోని రంగంపేట, సంగాయిపేట, చేగుంట మండలం నడిమి తండాల్లో వికసిత్ భారత్ యాత్రల్లో పాల్గొన్న కేంద్రం ఆరోగ్య శాఖ కార్యదర్శికి మెదక్ కలెక్టర్ రాజర్షి షా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సర్పంచులు బండి సుజాతారమేశ్, మానసాశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య సమస్య పరిష్కారానికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నదన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా 1632 రకాల ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలల్లో హెల్త్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దానికి మహిళలే ముందుకు రావాలని సూచించారు. ఉజ్వల్ యోజన పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామస్థాయిలో అమలవుతున్న వివిధ పథకాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ దవాఖానకు ఎక్కువగా పేదలు వస్తారని, అత్యవర మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి ఏరియా దవాఖానలో ఈసీజీ సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వికసిత్ భారత్‌యాత్ర ఈ నెల 16న ప్రారంభమైందని, వచ్చే నెల 24 జనవరి 2024 వరకు కొనసాగుతున్నదని, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలన్నదే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నెల 28 నుంచి గ్రామసభల ద్వారా రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. సంగాయిపేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర లో కేంద్ర ప్రభుత్వ పథకాలను డిజిటల్ స్క్రీన్‌పై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యా రోగ్య శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రాజేశం, జిల్లా వైద్యారోగ్య అధికారి చందు నాయక్, వ్యవసాయ శాఖ ఏడీ పుణ్యవతి, తహసీల్దార్ మహ్మద్‌గౌస్ మియా, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు, బాలికలు